

నేడు 'మీ కోసం' రద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే 'మీకోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వ సెలవు రోజు కావడంతో గ్రీవెన్స్‌ను నిర్వహించడం లేదని తెలిపారు. ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనై వినతులు అందించడానికి రావద్దని సూచించారు. సెప్టెంబరు రెండో తేదీన యథావిధిగా మీకోసం ఉంటుందని తెలిపారు.

బదిలీల కోసం పైరవీలు

- రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ
- 31వ తేదీ లోపు పోస్టింగ్‌లు
- కీలక స్థానాల కోసం పట్టు
- సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేల వద్ద క్యూ
- ఆదాయ వనరులున్న చోటే డిమాండ్

ప్రభుత్వం సాధారణ బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఉద్యోగుల్లో బదిలీల సందడి నెలకొంది. ఈనెల 31వ తేదీ లోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాలని ప్రభుత్వం గడువు విధించింది. చాలాకాలం తర్వాత సాధారణ బదిలీలు జరుగుతుండడంతో, అన్ని శాఖల ఉద్యోగులు తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కీలక స్థానాల కోసం పైరవీలు సాగిస్తున్నారు. సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఆదాయ వనరులున్న ప్రాంతాల్లో ఈ డిమాండ్ ఎక్కువగా ఉంది.

ప్రజాశక్తి - పలాస, నౌపడ

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలుత కలెక్టర్లు, ఎస్‌పిలు, జెసిలు వంటి ప్రధాన బదిలీలు జరిగాయి. ఆ తర్వాత డిఎస్‌పిలు, తహశీల్దార్లు, ఎంపిడిఒల బదిలీలు పూర్తయ్యాయి. ప్రస్తుతం పలు శాఖల్లో కిందిస్థాయి ఉద్యోగి వరకు బదిలీలు చేపడుతున్నారు. విద్యా, వైద్య, జైళ్ల శాఖలకు మాత్రం బదిలీలు లేవు. జిల్లాలో రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సివిల్ సప్లై, మైనింగ్ అండ్ జియాలజీ, అన్ని విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ స్టాఫ్, ఎండోమెంట్, ట్రాన్స్‌పోర్టు, ఇండస్ట్రీస్, ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు చేపడుతున్నారు.

సిఫార్సు లేఖల కోసం క్యూ

ఈనెల 27వ తేదీ లోగా అన్ని శాఖల ఉద్యోగులు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఉండాలి. 31వ తేదీ లోపు వారికి పోస్టింగ్‌లు ఇస్తారు. ఇంజినీరింగ్ విభాగంలో చాలామంది ఇంజినీర్లు బదిలీ కానున్నారు. ఐదేళ్లు దాటిన వారందరూ బదిలీ అవుతారు. ఇదే సమయంలో తాము కోరుకున్న చోట పోస్టింగ్ కోసం పలువురు పైరవీలు చేస్తున్నారు. ఆదాయ వనరులు పుష్కలంగా ఉండే మండలాల్లో పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేల వద్ద ఉద్యోగులు సిఫార్సు లేఖల కోసం క్యూ కడుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్,



పంచాయతీరాజ్ శాఖల్లో ఉద్యోగులు కీలక పోస్టింగుల కోసం పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సుల లేఖల కోసం వారి కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. రియల్ ఎస్టేట్, మైనింగ్ ఇతర ఆదాయ వనరులు పుష్కలంగా ఉండే మండలాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయా మండలాల్లో ఎలాగైనా పోస్టింగ్ దక్కించుకోవాలని పలువురు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. 2025, మార్చి 31వ తేదీలోపు ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులకు మాత్రం ప్రస్తుత సాధారణ బదిలీల నుంచి మినహాయింపు లభించింది. ఈమేరకు ప్రభుత్వం జిఒ నంబరు 76 జారీ చేసింది.

సచివాలయ ఉద్యోగాలు మ్యూచువల్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సర్వీసు అక్టోబరు రెండో తేదీ నాటికి ఐదేళ్లు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో తప్పనిసరి బదిలీలకు అవకాశం లేదు. వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు వీలు కాదు. మాన్యువల్‌గా కలెక్టర్‌కు దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలిస్తారు. దీనివల్ల ఉద్యోగులు మ్యూచువల్ పద్ధతిలో బదిలీలు జరుగుతాయి. సచివాలయాలకు సంబంధించి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, అందులోని ఇంజినీరింగ్ విభాగం, యానిమల్ హజ్బెండరీ, ఫిషరీస్, హోంలకు చెందిన ఉద్యోగులను కలెక్టర్ బదిలీ చేస్తారు. మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించి డిఎంహెచ్‌ఒ బదిలీ చేస్తారు. వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన ఉద్యోగులపై ప్రజాప్రతినిధులు ఆరా తీస్తున్నారు. అలాంటి వారిని దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అధికారుల కోసం ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

క్రీడాభివృద్ధికి పెద్దపీట

- అన్ని క్రీడాంశాల్లోనూ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేసి క్రీడాకారులకు అండగా ప్రభుత్వం ఉంటుందని కేంద్ర పౌర, విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని డిఇఒ కార్యాలయ సమీపంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ఖిల్లాగా శ్రీకాకుళం జిల్లాకు పేరుందన్నారు. జిల్లాకు చెందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారని కొనియాడారు. అన్ని జిల్లాల్లోని క్రీడా మైదానాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. వచ్చే ఐదేళ్లలో అన్ని క్రీడాంశాల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. క్రీడాభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ భవనంపై క్రీడాకారులు విశ్రాంతి తీసుకునేందుకు ఎంపీ ల్యాడ్ నుంచి నిధులు కేటాయించి, ఆరు నెలల్లో నూతన భవనం నిర్మించి అందజేస్తానని హామీనిచ్చారు. ఒక దేశ సంపద లెక్కించాలంటే ఆరోగ్యవంతులైన ప్రజలనే పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. ఆరోగ్య భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, క్రీడాకారుల జీవితాలతో ఆటలాడుకుందని విమర్శించారు. క్రీడలకు సంబంధించి ఎటువంటి నిధుల కేటాయింపులు చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయిందని తెలిపారు. ఎందరో యువ క్రీడాకారు లు క్రీడలకు దూరమయ్యారని, వారిని గుర్తించి వారి ప్రతిభను వెలికితీస్తామని చెప్పారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పిఇటిలు, పీడీలు, క్రీడాకారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టెక్కలి నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి ప్రజలు వచ్చి ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కొన్ని సమస్యలకు అక్కడక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సాగునీరు, త్రాగునీరు. రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నాయో ప్రణాళికలు వేసుకొని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బదిలీలపై వచ్చే అధికారులు చిత్తశుద్ధితో పనులు నిర్వహించి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారుర. గడిచిన ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాలు చీకటి మయమైయ్యాయని, ఎక్కడా తట్టెడు మట్టేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. ఇప్పటి నుంచి అందరం కలిసి కట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉత్తరాంధ్రకే 'జెమ్స్' తలమానికం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, కోటబొమ్మాళి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్య సమాజం కోసం ఎంతోమంది వైద్యులను అందిస్తున్న జెమ్స్ ఆసుపత్రి ఇటు ఉత్తరాంధ్ర, అటు ఒడిశాకు తలమానికంగా మారిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడును, శ్రీకాకుళం నగరంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కిమ్స్, జెమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అత్యాధునిక మౌలిక వసతులతో నిర్మించిన జెమ్స్ హాస్పిటల్, జెమ్స్ మెడికల్ కళాశాల, బొల్లినేని స్కిల్ సెంటర్‌లు, కొత్తగా విస్తరిస్తున్న కిమ్స్ ఆస్పత్రితో పాటు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రి, రిమ్స్ వైద్య కళాశాల, రిమ్స్ జనరల్ ఆస్పత్రి, మిగిలిన కార్పొరేట్ ఆస్పత్రులను అనుసంధానిస్తూ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించేందుకు స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రం చుట్టూ త్వరలోనే రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. జెమ్స్ మెడికల్ కళాశాల, దానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రి మెడికల్ యూనివర్సిటీ స్థాయికి చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటైన తర్వాత జిల్లాలో మెడికల్ హబ్‌కు కనెక్టివిటీ పెరుగుతుందని తద్వారా జిల్లా అభివృద్ధికి బాటలు వేయొచ్చని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వైద్య కళాశాలలో సీట్ల సంఖ్యను మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నుంచి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రులను కలిసిన వారిలో జెమ్స్ సిఇఒ బొల్లినేని అద్విత్, డైరెక్టర్లు డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, స్వర్ణ రామ్మోహనరావు తదితరులున్నారు.



మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన బొల్లినేని భాస్కరరావు



మాట్లాడుతున్న గిరిధర్

రాజ్యాంగ స్ఫూర్తితో శాస్త్రీయ దృక్పథ ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశం (ప్లీనం) ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా పీపుల్స్ సైన్స్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సభ్యులు జి.మురళీధర్ మాట్లాడుతూ ఆర్టికల్ 51 ఎ (హెచ్) ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దక్పథాన్ని కలిగి ఉండాలని రాజ్యాంగం సూచిస్తోందన్నారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్ మాట్లాడుతూ సైన్స్ ఉద్యమం ద్వారా మూఢ నమ్మకాల్లేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ అన్ని మండలాల్లో మండల కమిటీలు నిర్మించి జనవిజ్ఞాన వేదికను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, పర్యావరణం, యువత, సమత, సైన్స్ అండ్ కమ్యూనికేషన్, కల్చరల్, అగ్రికల్చర్, చెకుముకి, సోషల్ మీడియా సబ్ కమిటీలను పూర్తిస్థాయిలో నిర్మించి, వాటి ఆధ్వర్యాన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు బెందాళం కృష్ణారావు మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను తొలగించడానికి ప్రయత్నించాలన్నారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక తో కలిసి పనిచేస్తామన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం జిల్లా అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ శాస్త్రీయ దక్పథ క్యాంపెయిన్‌లో తాము భాగస్వామ్యమవుతామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం జిల్లా అధ్యక్షులు సంపతిరావు శశిభూషణరావు మాట్లాడుతూ యూనివర్సిటీ ఇతర ఉన్నత విద్యాసంస్థలలో జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలను నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. మానవ వికాస వేదిక ప్రతినిధి ప్రముఖ మెజీషియన్ సిహెచ్.ఉమామహేశ్వరరావు మూఢ నమ్మకాలను పారదోలడానికి మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో నిర్వహించ తలపెట్టిన చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయడం ద్వారా శాస్త్రీయ దృక్పథ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని సభ్యులు కోరారు. అనంతరం పోస్టరును ఆవిష్కరించారు. సమావేశంలో సమత జిల్లా నాయకులు సత్యప్రభ, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లారెడ్డి పద్మనాభరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వాగ్దేవి, పి.కూర్మారావు, ఎస్.సంజీవరావు, కోశాధికారి వి.ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ మాక్ పరీక్షకు స్పందన



మాక్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఎంపికైన అభ్యర్థులు మరింత సాధనతో తమ ప్రయత్నంలో విజయవంతం కావాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రోత్సహించారు. జిల్లాకు చెందిన గ్రూప్-2 అభ్యర్థులకు శ్రీకాకుళం విద్యాధరి కళాశాల, టెక్కలి విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల, పలాస మదర్ థెరిసా స్కూల్‌లో మాక్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించగా, జిల్లా నలుమూలలకు చెందిన 300 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఎర్రన్న విద్యాసంకల్పంలో భాగంగా గతేడాది గ్రూప్స్, డిఎస్‌సి, పోలీస్ కానిస్టేబుల్స్ విభాగాల వారీగా ప్రతిభా పరీక్ష నిర్వహించామని, దీనికి కొనసాగింపుగా గ్రూప్-2 మెయిన్స్ మాక్ పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు.

ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తాం

డిఇఒ తిరుమల చైతన్య

పలాస : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో బాలికపై విద్యార్థి వేధింపులకు గురి చేస్తున్న ఘటనపై ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి బాలిక, విద్యార్థి ఇళ్లకు వెళ్లి వేర్వేరుగా జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నంనాయుడుపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో జరిగిన ఘటనా భవిష్యత్‌లో ఒక హెచ్చరికగా భావిస్తున్నామన్నారు. పాఠశాలలో ఆడ పిల్లల సమస్య వచ్చిన వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. కానీ, ప్రధానోపాధ్యాయుడు చిన్నంనాయుడు పని ఒత్తిడి, సిసిఎస్ పరీక్షలు ఉండడంతో పట్టించుకోకపోవడంతో సమస్య జటిలమైందన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరించి ఉంటే ఇంత సమస్య ఉండేది కాదన్నారు. బాలిక, విద్యార్థి ఇంటికి వెళ్లి ఇరువురు తల్లిదండ్రులతో పాటు విద్యార్థులతో జరిగిన సమస్యను అడిగి తెలుకున్నామని అన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులపై విచారణ చేపట్టమని తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆయనతోపాటు పలాస ఎంఇఒ-2 చెరుకుపల్లి సత్యం, వజ్రపుకొత్తూరు ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.దాశరథి ఉన్నారు.



విచారణ చేస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నగరంలోని అరసవల్లి సమీపంలో పిఆర్‌టియు నూతన భవనాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. దేశంలో విజ్ఞత, విధేయత గల పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకంగా ఉంటారన్నారు. ఉపాధ్యాయులను గత ప్రభుత్వం అగౌరవపరిచింద న్నారు. ఉపాధ్యాయుల ను వేధించే ఏ ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్కువ కాలం మనుగడ సాధించలేద దన్నారు. వైసిపి ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణయ్య, గిరి ప్రసా ద్, గౌరవాధ్యక్షులు బైరి అప్పారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, కేశవరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- కాలువల్లో ముమ్మరంగా పూడికతీత
- 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు
- ఇన్‌ఛార్జి డిపిఒ ఆర్.వెంకటరామన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామనిజిల్లా ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారి ఆర్.వెంకటరామన్ తెలిపారు. గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన ఆర్థిక సంఘం నిధులు, ఇతర అభివృద్ధి నిధులతో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నామని అన్నారు. ఇందులో భాగంగా కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో అవసరమైన విద్యుత్‌దీపాలు ఏర్పాటు, నిర్వహణ, తాగునీటి పథకాల నిర్వహణ వంటి పనులు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయని అన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఉపాధి పనులను గుర్తించడం, వాటిని గ్రామస్థాయిలో అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? పారిశుధ్య పనులు ఎలా సాగుతున్నాయి?

వర్షాకాలం ప్రారంభమైన తర్వాత జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనలతో క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొనసాగుతోంది. గ్రామాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో పెద్దఎత్తున అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామ సచివాలయ ఉద్యోగులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులతో కాలువల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఎక్కడా మురుగు నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శులు, నాయకుల సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేశాం.

? విద్యుత్ ఛార్జీల నిధుల కొరతను ఎలా అధిగమిస్తున్నారు?

గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు వారి ఖాతాలకే జమయ్యాయి. వాటితో పాటు ఎన్నికలు పూర్తయి వాటితో ఏకగ్రీవ పంచాయతీలకు పారితోషక నిధులు, పంచాయతీల్లో పన్నులు, ఇతర సెస్‌ల రూపంలో వసూలవుతున్న నిధులు ఉన్నాయి. జనరల్ ఫండ్ ఖాతా నుంచి వీటిని వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు చెల్లించాం. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో ఇతర పనులు చేపట్టేందుకు వీలు కలిగింది.





? గ్రామాల్లో చెత్త సేకరణ ఎలా సాగుతోంది?

ప్రభుత్వం తడి, పొడి చెత్త సేకరణకు పెద్దఎత్తున చర్యలు చేపట్టింది. అందులో బాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి వీలువుతుంది. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే ప్రతి ఇంటికీ చెత్త వేరు చేసుకునేందుకు డబ్బాలను అందజేశాం. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నాం. ఆ సేకరించిన చెత్త నిల్వ చేసుకునేందుకు, వాటి నుంచి సంపద తయారీకి అనువుగా షెడ్లను నిర్మిస్తున్నాం. కొన్నిచోట్ల నిర్మాంచి షెడ్లను వినియోగంలోకి తీసుకురాక పోవడంతో పాడయ్యాయి. వాటిని తిరిగి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే దిశానిర్దేశం చేశాం. షెడ్ల నిర్మాణంలో లేని ప్రాంతాల్లో స్థల సేకరణకు తహశీల్దార్లు, ఎంపిడిఒలు సమన్వయంతో చర్చించి ఏర్పాట్లు చేసుకోవాలి.

? సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

జిల్లావ్యాప్తంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈనెల 30లోగా ఈ బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. క్లియర్ వేకెన్సీ ఉన్న స్థానాలతో పాటు మ్యూచువల్స్ తదితర 8 రకాల నిబంధనలను ప్రభుత్వం సూచించింది. ఆ నిబంధనలకు లోబడి బదిలీలు ఉంటాయి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.


కేంద్రమంత్రిని సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ఎడ్యుకేషన్ లైబ్రరీ ఏర్పాటు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో ఎడ్యుకేషన్ లైబ్రరీ ఏర్పాటు చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం, జనసేన నాయకుడు గొర్లె సూర్య నిరహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత నిత్య అన్నదాన శిబిరం 242వ రోజుకు చేరిన సందర్భంగా సందర్శించారు. అనంతరం ఎచ్చెర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు కేంద్రం మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. వీరితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ చేసినట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఎన్ఇఆర్ స్కూల్ అఫ్ ఎక్సలెన్స్‌లో ఎపిటోరియా పరిశ్రమ కోసం కెమిస్ట్రీ ఉద్యోగాల కోసం జాబ్‌మేళా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యువత ఉపాధి పొందడానికి వరుసగా జాబ్‌మేళాలు నిరహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాకు వచ్చిన అభ్యర్థులను ఆయన అభినందించారు. ఈ జాబ్‌మేళాకు సుమారు 1000 మంది హాజరుకాగా అర్హులైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తామని పరిశ్రమ ప్రతినిధులు వెల్లడించారు. హెచ్ఆర్ సీనియర్ హెడ్ కమలాకర్ మాట్లాడుతూ జాబ్‌మేళాలతో వివిధ ప్రాంతాలకు చెందిన వారికి ఉపాధి కలుగుతుందని వివరించారు. కార్యక్రమములో స్కూల్ డైరెక్టర్ తేజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సిఐ చిన్నంనాయుడును సన్మానిస్తున్న తులసీదాస్‌రెడ్డి తదితరులు

ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలని సిఐ చిన్నంనాయుడు సూచించారు. స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో చైర్మన్ చాట్ల తులసీదాసురెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు లైసెన్స్, హెల్మెట్ ధరించాలన్నారు. తులసీదాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సరైన లక్ష్యాలను పెట్టుకొని జీవితంలో ఉన్నత స్థానాలను పొందాలన్నారు. అనంతరం సిఐకి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి రాము రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ సుజాత, ప్రిన్సిపాళ్లు కె.సందీప్, జె.జయప్రకాష్, గౌరీశంకర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'నీట్'లో మెరిసిన చైతన్య

ప్రజాశక్తి- పలాస


చైతన్య


ఇటీవల విడుదలైన నీట్ పిజి పరీక్షల ఫలితాల్లో మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన దంతం చైతన్య ఆల్ ఇండియాలో 86వ ర్యాంకు సాధించారు. ఈ ఏడాది ఆగస్టు 11న జరిగిన నీట్ పిజి పరీక్షలో ఆల్ ఇండియాలో 86వ ర్యాంకు సాధించి తన సత్తాచాటారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ మా తాత చిన్నబాబు ఆర్ఎంపి వైద్యులుగా పనిచేసే వారిని, ఆయన ఎంతో మందికి వైద్య సేవల నుంచి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారని అన్నారు. తన తాతను ఆదర్శంగా తీసుకుని వైద్య రంగంలో చేరానని అన్నారు. నిరుపేదలకు మంచి వైద్య సేవలు అందించాలని ఆలోచనతో ముందుకు వెళ్తున్నానని తెలిపారు.



కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరానికి స్పందన

ఆమదాలవలస: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా ప్రతిఒక్కరూ నిలవాలని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో వినోద్ కిడ్స్ ఆస్పత్రి సహకారంతో కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేస్తే మరో ముగ్గురిని కాపాడవచ్చనని, రెడ్‌క్రాస్ సంస్థ కోవిడ్ సమయంలో స్వచ్ఛందంగా ప్రజలకు పలు రకాల సేవలను అందించిందని గుర్తు చేశారు. మూడు నెలలకు ఒకసారి 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వ్యక్తులు రక్తదానం చేయవచ్చునన్నారు. కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ చిన్న వయస్సులోనే ఇటువంటి సేవలు అందించడం అభినందనీయమని, భవిష్యత్‌లో మరెన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ రక్తదాన శిబిరంలో 92 మంది రక్తదానం చేశారు. చిన్న పిల్లల వైద్యులు కూర్మాన వినోద్ కుమార్, డాక్టర్ పి.తాతయ్యలు, డాక్టర్ సిహెచ్ సుధాకర్, సీపాన హేమ మోహన్ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కృతిక్ ఫౌండేషన్ సభ్యులు వాయుపుత్ర జిమ్ కోచ్ శ్రీనివాసరావు, బమ్మిడి రాము, షణ్ముక, వి.లక్ష్మణరావు, హరీష్ పాల్గొన్నారు.


గోతులు పూడ్చుతున్న యువకులు

గుంతలు పూడ్చివేత

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం కూడలి వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు కారణంగా అనునిత్యం పలు ప్రమాదాలు చేసుకుంటున్నాయి. దీనిపై స్పందించిన పోలీసులు, సింగన్నపాలెం టిడిపి నాయకులు టి.శ్రీనివాసరావుకు విషయం వివరించారు. వెంటనే శ్రీనివాసరావు సమీప గ్రామాల యువత సహకారంతో ఎర్రమట్టితో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. ప్రమాదాల నివారణకు యువత ముందుకు రావడం అభినందించదగ్గ విషయమని కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

నరేంద్రపురంలో సమస్యలు తిష్ట

- అధ్వానంగా పారిశుధ్యం
- తాగునీటికి అవస్థలు
- శిథిలావస్థలో పాఠశాల భవనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


బావి చుట్టూ ఉన్న అపారిశుధ్యం

దేశ ప్రగతికి పల్లెలే పట్టుకొమ్మలు. పల్లెలు బాగుంటేనే రాష్ట్రం, తద్వారా దేశం కూడా అభివృద్ధి చెందుతుందని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న నేతలు ఆ పల్లెలు అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. సదుపా యాలు మాట అటు ఉంచితే కనీస అవసరాలు తీర్చేందుకు కూడా పాలకవర్గం, ప్రభుత్వ అధికార యంత్రాంగం పట్టించు కోకపోవడం శోచనీయం. సమస్యలు తిష్ట వేయడంతో నరేంద్ర పురం గ్రామస్తులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని మొర పెడుతున్నారు.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని దేవిపేట పంచాయతీ పరిధిలోని నరేంద్రపురంలో సమస్యలు తిష్ట వేశాయి. చుట్టూ పచ్చని పంట పొలాలు, పంట పొలాల మధ్య చక్కటి రహదారి, తాగునీటి అవసరాలు తీర్చేందుకు పురాతన బావి ఇవన్నీ గతం. నేడు నరేంద్రపురంలో తీరని సమస్యలు గ్రామస్తులను తీవ్రంగా వేధిస్తున్నాయి.

తాగునీరు కరువే

గ్రామం మధ్యలో గ్రామస్తుల అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన పురాతన బావి నేడు బావి చుట్టూ మురుగునీరు చేరిపోవడంతో తాగునీరు కలుషితమైంది. కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా ఉపయోగపడటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు పోయేందుకు సరైన సౌకర్యం లేకపోవడంతో ఈ భావి నిరూపంగానే ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే గ్రామంలో ఉన్న ఏకైక హ్యాండ్ బోర్ మాత్రమే పనిచేస్తుండటంతో అన్ని అవసరాలకు ఈ బోరుపైనే ఆధారపడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. కొళాయిలు ఏర్పాటు చేస్తామని ప్రతిసారి ప్రకటన గుప్పిస్తున్న పాలకులు మాత్రం కొళాయిలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి అవస్థలు



తమ కనీస అవసరాలు తీర్చేందుకు కూడా నీరు లేదు. 40 కుటుంబాలకు కేవలం ఒక్క బోరే ఉంది. దీంతో అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలి.

- టెక్కలి నాగమణి, నరేంద్రపురం

పంట పొలాలే రహదారులు

నరేంద్రపురం గ్రామస్తులు అటు హిరమండలం, సరుబుజ్జిలి వెళ్లేందుకు గ్రామ సమీపంలో ఉన్న చెరువు గట్టు పక్కనే ఉన్న రహదారి ఉపయోగించుకునే వారు. ఆ రహదారి చిద్రమవ్వడంతో ప్రయాణం దుర్భరంగా మారిందని గ్రామస్తులు వాపోయారు. ప్రస్తుతం పంట పొలాల మధ్య నడుస్తూ గమ్యానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అయితే గ్రామానికి అవసరమైన అంబులెన్స్, ఇతర వాహనాల రాకపోకలకు గగనమవుతుందని వాపోయారు.

శిథిలమైన పాఠశాల భవనం

గ్రామంలో ఉన్న పాఠశాల భవనం నేడు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉందని, అయితే ఇదే భవనంలో పాఠశాలతో పాటు అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పంట పొలాల మధ్య నుంచి నడకదారి


బురదమయంగా ఉన్న వీధి రహదారి

ముఖ్యంగా గ్రామంలో రహదారులతో పాటు కాలువలు కాలువలు కూడా లేకపోవడంతో మురుగు నీరంతా వీధి మధ్యలో నిల్వ ఉంటూ చెరువును తలపిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. దీంతో వ్యాధులు ప్రజలే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించు కున్నప్పటికీ సమస్యలు పట్టించుకున్న నాధుడే కరువ య్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



గ్రామంలో అపారిశుధ్యం నెలకొంది. దుర్గంధం వెదజల్లుతుంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికా రులు రహదారి, కాలువలు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలి.

- వండన త్రినాథమ్మ, నరేంద్రపురం

అభివృద్ధి పనులకు నిధులు

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీలో సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణాలకు జెడ్‌పి నుంచి రూ.2 లక్షలు మంజూరైనట్లు జెడ్‌పిటిసి కె.భాగ్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు మంజూరు చేసిన జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు లోతుగెడ్డ తిరుపతిరావుకు కృతజ్ఞతులు తెలిపారు. ఈ నిధులతో కర్లెమ్మ పంచాయతీని అభివృద్ధి చేస్తామని అన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు: మండలంలోని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామనిమాజీ సర్పంచ్ మరడ భాస్కర్‌రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు మరడ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి వైద్యులు నేత్రాలను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా శాస్త్ర చికిత్స అందిస్తారని వారు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. ఉద్యోగులు, ఇఎస్ఐ కార్డులు ఉన్నవారూ అర్హులని తెలిపారు.

పలాస: పలాస క్యాజూ లేబర్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ నలుగురు సేవా సంస్థ ఆధ్వర్యాన నిర్వహించే ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పొందూరు : ఉట్టి కొడుతున్న విద్యార్థులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. సోమవారం కృష్ణాష్టమి కారణంగా పాఠశాలలకు సెలవుదినం కావడంతో శనివారమే వేడుకలు నిర్వహించారు. పొందూరు ఎంపిపిఎస్-1 స్కూల్, మానసవేణి పాఠశాలల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికలు వేషధారణతో అలరించారు. ఉట్టికొట్టి వేడుకలు జరుపుకున్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్‌లో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు గోపికలు, రాధ, కృష్ణ వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డా. కె.మధుసూదన్ విద్యార్థులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల హెచ్ఎం పి.రామారావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభలు విజయవంతం

కోటబొమ్మాళి: మండలంలోని 34 పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు విజయవంతమయ్యాయని ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు పాగోటి అనిల్‌కుమార్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామసభలో అధికారులతో పాటు టిడిపి కూటమి నాయకులు పాల్గొని ప్రజలతో మమేకమై గ్రామాల్లోని స్థానిక సమస్యలను తెలుసుకున్నారని అన్నారు. పంచాయతీరాజ్ మంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రతి పంచాయతీకీ పూర్వవైభాగం వచ్చే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు.

స్నేహితుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు అల్లు యోగేశ్వరరావు కుటుంబానికి సంతబొమ్మాళి యువజన సంఘం సభ్యులు రూ.21,350 ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. సంతబొమ్మాళికి అనారోగ్యానికి గురై యోగేశ్వరరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వైద్య ఖర్చులు ఎక్కువ కావడంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న స్నేహితులు ఆదుకున్నారు. కార్యక్రమంలో యువజన సంఘ ప్రతినిధులు కూచెట్టి భానుప్రకాష్, అట్టాడ సాయికుమార్, భాస్కరరావు, సంతు శివ, సూర్య, భీమారావు, శేఖర్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

అమర జవాన్ల స్థూపం నిర్మించాలి



రాజారావును సత్కరిస్తున్న మాజీ సైనికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మాజీ సైనికులు ఆదివారం పెద్ద రెల్లివీధిలో తమ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల వీరమరణం చెందిన జిల్లా సైనికులను స్మరించుకుంటూ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కటకం పూర్ణచంద్రావు మాట్లాడుతూ మాజీ సైనికుల కోసం ప్రస్తుత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విడుదల చేసిన జవాన్ డిక్లరేషన్‌లో భాగంగా పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయిలో మాజీ సైనికుల కార్పోరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అమర జవాన్ స్థూపం జిల్లా నడిబొడ్డున ఏర్పాటు చేసి యువతలో దేశభక్తిని పెంచేలా, సైన్యంలో మరింత మంది చేరేందుకు దోహద పడుతుందన్నారు. సమావేశంలో మాజీ సైనికుల కవాతులో జిల్లా నుంచి పాల్గొన్న హవాల్దార్ ఇ.రాజారావును దుశ్శాలువతో సత్కరించారు. సమావేశంలో ఫెడరేషన్ చైర్మన్, గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎస్.ఎల్.రావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, ట్రెజరర్ ఎం.సింహాచలం, జి.అమ్మన్నమ్మ, విజయలక్ష్మి, జమున, పుణ్యవతి, డి.వాసుదేవరావు, బి. రాంబాబు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్. అప్పలసూరి, ఎం.రాములు పాల్గొన్నారు.

లక్ష్యసాధన దిశగా అడుగులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం సాధన దిశగా అడుగులు ముందుకు వేయాలని విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ చాపర లీల అన్నారు. మండలంలోని పూండిలో సాయి వినీత్ విద్యా సంస్థ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ ఫ్రెషర్స్ డే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతవిద్య పరంగా వెనుకబడిన ఈ ప్రాంతంలో ముఖ్యంగా బాలికలను విద్యావంతులు చేయాలనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ ఈ కళాశాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇంటర్ విద్య భవిష్యత్ విద్యకు పునాది వంటిదని అన్నారు. క్రమశిక్షణతో విద్య నభ్యసించిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కాలంతో పాటు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. మెడిసిన్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ఉన్నత చదువులు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సిద్ధం చేస్తున్న అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు. విద్యార్థులలో విద్య సంబంధ నైపుణ్యాలతో పాటుగా జీవన సాఫల్య నైపుణ్యాలు పెంపొందించడంలో అధ్యాపకులు కృషి అభినందనీయమని అన్నారు. అనంతరం సినీ జానపద నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చాపర కోదండరావు, డైరెక్టర్లు డాక్టర్ చాపర సాయి వినీత్, డాక్టర్ పూజిత దేవి, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాష్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిన శ్రీను, అధ్యాపకులు బచ్చలి ధర్మారావు, శూల ధర్మారావు, సాయిప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లీల

ముత్యం ఆశయాలను కొనసాగిద్దాం



బొడ్డపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

ప్రొఫెసర్ ముత్యం అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించినప్పుడే ఆయనకు ఇచ్చిన నిజమైన నివాళి అని ప్రజా సంఘాల నాయకులు, వక్తలు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షత ముత్యం సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ముత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముత్యం తెలుగు సాహిత్య పరిశోధకులుగాను శాతవాసన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేశారని గుర్తు చేశారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళం సాహిత్యంపైన పిహెచ్‌డి చేశారని తెలిపారు. 45 ఏళ్లుగా సాహిత్య పరిశోధన చేసి చరిత్రకు అదనపు సంపదను చేకూర్చారన్నారు. ఆర్ట్స్ కాలేజ్ పిడిఎస్ అధ్యక్షులకు ఎన్నికైన ముత్యం అదే భావజాలంతో జీవితాంతం జీవించారని తెలిపారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్, సిపిఐఎంఎల్ లిబరేషన్ సీనియర్ నాయకుల మద్దిల మల్లేశ్వరరావు, పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి పిండి వెంకట్రావు, పిడిఎం రాష్ట్ర నాయకులు సాలిన వీరాస్వామి, లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఎఐకెఎంఎస్ నాయకులు మామిడి భీమారావు, అరుణోదయ జిల్లా అధ్యక్షులు రామారావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి



శ్రీకాకుళం అర్బన్ : పత్రాలను అందజేస్తున్న రోటరీ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇన్‌స్పైర్ పాఠశాల ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రోటరీ క్లబ్ సంయుక్తంగా 'కంటి ఆరోగ్యం - నేత్రదానం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య నిపుణులు డా. బొడ్డేపల్లి అనురాధ హాజరై మాట్లాడుతూ ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు కార్నియల్ అంధుల జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు. ప్రతిఒక్కరూ వారి నేత్రాలను సంరక్షించుకుంటూ ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు జరిపించుకుంటు సంరక్షించు కోవాలన్నారు. మరణానంతరం వారి ఆరోగ్య వంతమైన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడి సజీవంగా ఉంటాయన్నారు. కుటుంబ సభ్యులు అంతా అవగాహన కలిగి నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కె దాస్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మరణానంతరం వారి నేత్రాలు దానం చేయటం సాంప్రదాయం చేసుకోవాలన్నారు. రోటరీ ప్రతినిధులకు కంటి ఆరోగ్యం నేత్రదానంపై అవగాహన కల్పించారు. సదస్సు అనంతరం 25 మంది రోటరీ ప్రతినిధులు నేత్రదానానికి అంగీకరించి ప్రతిజ్ఞ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కేన్సర్ శస్త్రచికిత్స నిపుణులు డా.బమ్మిడి సందీప్, ఎమర్జెన్సీ వైద్యనిపుణులు డా. వారణాసి సందీప్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, దూసి సంతోష్ కుమార్, ప్రతినిధులు అన్నెపు అనంతరావు, దేవరశెట్టి శివశంకర్, బరాటం శ్రీనివాస, పసగడ సూర్య, ధర్మాన ధర్మారావు, జెసిఐ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పొందూరు: మరణించిన తరువాత నేత్రదానంతో పునర్జన్మ పొందవచ్చని ఆప్తాలమిక్ అసిస్టెంట్, శ్రీకాకుళం రొటేరియన్ ఎస్.వసంతరావు అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ఆదివారం ప్రభావతి జాగృతి ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మానసవేణి స్కూల్‌లో నేత్రదానంపై అవగాహన నిర్వహించారు. నేత్ర దానంతో ఇద్దరికి ప్రపంచాన్ని చూసే అవకాశం కల్పించిన వారవుతారన్నారు. మూఢ నమ్మకాలతో విలువైన నేత్రాలను దానం చేయకుండా ఉండవద్దన్నారు. మరణించిన 6 గంటలలోపు నేత్రాలను భద్రపరచాలని సూచించారు. నేత్రదానంపై గ్రామాల్లో అవగాహన పెరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కుమార్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్

సీతమ్మ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- పలాస

పలాస సీతమ్మతల్లి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం తాళాలు పగులకొట్టి హుండీలో ఉన్న నగదు అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు, ఆలయ నిర్వాహకులు కథనం మేరకు... సీతమ్మతల్లి ఆలయం గ్రామానికి సమీపంలో ఉంది. రోజూ ఉదయం ఆరు గంటల సమయంలో ఆలయ పూజారమ్మ ఇప్పిలి సాయమ్మ ఆలయాన్ని తెలుస్తూంది. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం ఆలయం ప్రధాన తలుపులు తెరిచి లోపలకు వెళ్లింది. గర్భగుడికి వేసిన తాళాలు పగలగొట్టి హుండీలో ఉన్న సుమారు రూ. 5 వేలు నగదును అపహరణకు గురైనట్లు గుర్తించింది. వెంటనే స్థానిక కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, ఆలయ కమిటీ గాలి కృష్ణారావు, గంట చిన్నారావు, సుడియా హరికృష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం శ్రీకాకుళం క్లూస్ టీం ఆలయం గర్భగుడి, విడిచిపెట్టి వెళ్లిన హుండీ తదితర ప్రాంతాలను పరిశీలించింది. హెచ్‌సి రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

నందిగాం : మండలంలోని నందిగాం నేషనల్ పాఠశాల వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బెజ్జపెల్లికి చెందిన ఆటో డ్రైవర్ పొందర తేజారావు తన భార్య అరుణ్ కుమారిని నందిగాంలోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి తీసుకెళ్తుండగా అదే మార్గంలో టెక్కలి వైపు నుంచి వస్తున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కారును స్వల్పంగా ఢీకొంది. అనంతరం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తేజారావు, అరుణ్ కుమారిలు గాయపడ్డాడరు. వెంటనే హైవే అంబు లెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలిం చారు. ఎస్ఐ మహమ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


దీక్ష చేస్తున్న యువకులు

కొనసాగుతున్న దీక్షలు


ప్రజాశక్తి- కవిటి

తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ భవిష్యత్ భరోసాకు బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 242వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సంఘాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- పోలాకి

మహిళా స్వయం శక్తి సంఘాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని టిడిపి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం జి.రాజారావు ఆధ్వర్యాన లకపతి దీదీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలు తమకు ఇచ్చిన బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చిన రుణాలు రూ.4.4 కోట్ల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ బైరి భాస్కరరావు, కె.పి.వలస సర్పంచ్ టి.లక్ష్మీనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, సిసిలు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న వెంకటప్పలనాయుడు



పోస్టర్‌ను అవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పశు వ్యాధులపై అప్రమత్తం

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి వ్యాప్తి చెందుతాయని పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో పశువైద్య సహాయ సంచాలకులు ఎం.లోకనాథం, కరుడు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్‌తో కలిసి గాలి కుంటువ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ పోస్టర్‌ను ఆదివారం అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధుల నివారణకు ప్రభుత్వం టీకాలు అందిస్తుందని, ఈ టీకాలను రైతులు పశువులకు సక్రమంగా వేయించాలన్నారు. ప్రతి గ్రామానికీ పశువైద్యాధికారులు, సిబ్బంది వచ్చి మీ పశువులకు ఈ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నారని అన్నారు. పశువులు వ్యాధి బారిన పడి వాటిని వైద్యం అందించేకంటే ముందే ఈ వ్యాధి నివారణ టీకాలు వేసుకుంటే వ్యాధి సోకే ప్రమాదం నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందుకుంటున్న ఎమ్మెల్సీ దంపతులు

అరసవల్లిని సందర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శాసన మండలి సభ్యులు నర్తు రామారావు, చామంతి దంపతులు సందర్శించారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన వీరికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ అధికారులు శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

రూ.రెండు లక్షల విరాళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన కీర్తి గోవిందరావు రూ.లక్ష, పొట్నూరు వెంకట సాయికృష్ణ రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ ఇఒ ఎస్‌చంద్రశేఖర్‌ను కలిసి చెక్కును అందజేశారు.



గొడుగులను పంపిణీ చేస్తున్న ఢిల్లీరావు

గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడుకు చెందిన తెలుగు యువత మండల అధ్యక్షుడు, బొడ్డపాడు జైభీం యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు ఆదివారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ రామాలయం, ఆర్‌టిసి కాంప్లెక్స్, కాశీబుగ్గ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉంటున్న నిరు పేదలకు వంద గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం కాశీబుగ్గ స్వామి వివేకానంద సేవా సంఘంలో నిరు పేదలకు అన్నదానం నిమిత్తం రూ. 2 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పత్రి తాతారావు, బొడ్డు జగన్, ఇప్పిలి రాజేష్, మద్దిలి మధు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధికి రుణాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాల్లో తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలను గుర్తించి వారి జీవనోపాధులను మెరుగుపర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అవసరమైన తోడ్పాటును అందించి వారికి వ్యక్తిగతంగా ఉమెన్‌లెడ్ ఎంటర్ప్రైజెస్ పేరుతో బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. ఆదివారం లక్పత్ దీదీలు, సిఆర్‌పిలతో ర్యాలీ నిర్వహించి అనంతరం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా సభ్యులందరికీ వినిపించి అవగాహన కల్పించారు. బాగా పనిచేసిన సిఆర్‌పిలను గుర్తించి మండల సమాఖ్య ప్రతినిధులు వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు తమ్మినేని ధనలక్ష్మి, గొర్లె ఉషారాణితో పాటు మండల సమాఖ్య సిబ్బంది, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రామప్పడు ,రమణ, చంద్రావు, సుభద్ర, ఉమ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

రైతుబజార్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నో ఏళ్ల నుంచి కలగా మిగిలిన రైతుబజార్ ఏర్పాటుకు టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. అందులో భాగంగా గతంలో రెండుసార్లు రైతుబజార్‌కు శంకుస్థాపన చేసిన న్యూ కాలనీలో స్థలాన్ని, ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ ప్రాంతం, పాత బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం కాశీబుగ్గ పాత బస్టాండ్‌లో ఉద్దాన ప్రాంత రైతులు బజార్ నిర్వహిస్తున్న రైతులతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గత కొంతకాలంగా ఆక్రమణలకు గురై ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణ తొలగించి యుద్ధప్రాతిపదికన మున్సిపాలిటీ చైర్మన్, కమిషనర్, ఆ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మించే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కాశీబుగ్గలో రైతుబజార్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతుబజార్ ఏర్పాటు చేయడం ద్వారా పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, మల్లా శ్రీనివాసరావు, మలిపెద్ది నరేంద్ర, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వెంకన్న చౌదరి



ప్రొక్లెయినర్‌తో పొగురు తీస్తున్న రైతులు

డొంకూరులో పొగురుతీత

ఇచ్ఛాపురం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో ముంపునకు గురైన పంట పొలాల్లో నీరు చేరింది. ఆ నీటిని సముద్రంలోకి వెళ్లేందుకు గ్రామస్తులు చందాలు వేసుకుని పొగురుతీ పనులు ఆదివారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు తీరప్రాంతం డొంకూరు, పెద్దాలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురానికి చెందిన వందల ఎకరాలు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరకు రైతులు పొగురు తీత పనులు చేపట్టిడంతో పొలాల్లో చేరిన నీరు తగ్గుముఖం పడుతుంది.

వికలాంగునికి అండ

పలాస: పలాసకు చెందిన మురపాక రామారావు వికలాంగుడికి అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. కాశీబుగ్గలో స్మాల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో మురపాక రామారావు ఆర్టిఫిషియల్ లెగ్గు పెట్టిన నూతన దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామారావు వికలాంగుడైనా మొక్కవొని ధైర్యంతో ముందుకొచ్చి తన లాంటి వాళ్లకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఆర్టిఫిషియల్ లెగ్గు దుకాణం పెట్టడం ఆనందంగా ఉందన్నారు. వికలాంగులకు తనవంతుగా సహాయ సహకారాలు అందించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి భాస్కరరావు, పెంట ఉదయ శంకర్, బి.రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

పర్లాకిమిడి ఎంపీని కలిసిన ఉమ

పాతపట్నం: ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి ఎంపీ ప్రతిప్ పానిగ్రహిణిని మండలంలోని పెద్దలక్ష్మీపురం సర్పంచ్ అన్నపు ఉమామహేశ్వరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాతపట్నంలో బిజెపి బలోపేతానికి కృషి చేయాలని ఉమాను ఎంపీ కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



యువత శ్రమదానం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పరిధిలోని పెంటిభద్రకు చెందిన గిరిజన యువకులు ఆదివారం శ్రమదానం చేశారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి రోడ్డు కూడలి నుంచి పెంటిభద్ర రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడం, వర్షాకాలం కావడంతో రోడ్డుపై ప్రయాణించే ప్రజలకు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. దీనిని గుర్తించి యువత ముందుకొచ్చి శ్రమదానంతో శుభ్రం చేయించారు. అందుకయ్యే ఖర్చును చందాలు వేసుకుని రహదారిని బాగు చేసుకున్నామని మాజీ కౌన్సిలర్, టిడిపి నాయకులు సవర రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో సవర తిరుపతి, అర్జున్, వైకుంఠరావు, ఉమాశంకర్, రమణ, మోహనరావు, గున్నయ్య, ఆదినారాయణ, శాంతారావు పాల్గొన్నారు.



రోడ్డును శుభ్రం చేస్తున్న యువకులు



గోతులమయమైన రహదారి

ఈ రోడ్డుకు మోక్షం లేదా?

ప్రజాశక్తి- నందిగాం

మండలం నందిగాం నుంచి సుబ్బమ్మపేటకు వెళ్లే రహదారి ఏళ్లు గడుస్తున్నా నరకాన్ని తలపిస్తుంది. ఈ మార్గంలో అనునిత్యం వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఈ రహదారి గ్రామానికి చెందిన నాయుడు అని పిలవబడే ఓ పెద్ద రైతు తమ పొలముకు వెళ్లేందుకు 1955లో ఈ రహదారి నిర్మించుకున్నారు. అయితే అటు తరువాత తూతూమంత్రంగానే పనులు చేపడుతున్నారే తప్ప పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ఇబ్బందులు గురికాక తప్పడం లేదు. అయితే ఈ రహదారి సుబ్బమ్మపేట మొండిరావివలస, ఆకుల రఘునాథపురం గ్రామస్తులు తరచూ తిరుగుతుంటారు. అయితే రహదారిపై పిచ్చి మొక్కలు, పెద్ద గోతులు ఏర్పడడంతో కనీసం నడిచేందుకైనా వీలులేకుండా పోతుంది. అనేక పర్యాయాలు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టారు. మండల కేంద్రానికి రావాలంటే ఈ రహదారి నుంచే రావాల్సి వస్తోంది. వైసిపి ఐదేళ్ల పాలనలో కనీసం రహదారిపై ఒక తట్టెడు మన్ను కూడా వేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే పాలకులు, అధికారులు చొరవ చూపి మండల కేంద్రానికి వెళ్లే ఈ రహదారిని బిటి రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

మొక్కలు నాటాలి

ప్రజాశక్తి పలాస

పర్యావరణం పరిరక్షణకు యువత మొక్కలు నాటాలని టిడిపి రాష్ట్ర శ్రీశయన నాయకులు బూరెల కృష్ణంరాజు, టిడిపి మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణపురంలో ప్రతి చేనుకు నీరు కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలను ఆదివారం తొలగించారు. గ్రామ చుట్టూ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో మొక్కలు నాటడం వల్ల వేపుగా పెరుగుతాయన్నారు. నాటిన మొక్కలను సంరక్షణ చేస్తే మానవాళికి ప్రాణ వాయువు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపురం మాజీ సర్పంచ్ ప్రతినిధి, టిడిపి నాయకులు నిమ్మాడ బాబూరావు, ఢిల్లీ, ఆనంద్, ముకుందరావు, ప్రసాద్, నెయ్యిల బాబూరావు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న యువకులు

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలిలో సోమవారం అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్నామని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని అన్నారు. ఈనెల 15న నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లో ప్రారంభయ్యాయి. కానీ, టెక్కలిలో మాత్రం ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్ నిర్వహణకు సొంత భవనం లేకపోయింది. కానీ, స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఉన్న కార్ల స్టాండ్ వద్ద క్యాంటీన్ ప్రారంభించనున్నారు. టెక్కలి డిపోకు కేటాయించిన మూడు ఆర్‌టిసి బస్సునూ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. టెక్కలి నుంచి ఇచ్ఛాపురం, అక్కడి నుంచి విశాఖకు బయలుదేరే ఈ మూడు సర్వీసులను ప్రారంభిస్తారని తెలిపారు.



పొలంలో ఆకు కట్టలు వేసిన రైతు

ముమ్మరంగా వరి నాట్లు

మెళియాపుట్టి : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు ఊరట చెందారు. దీంతో మండలంలోని పెద్దలక్ష్మీపురం, చీపురుపల్లి, పరశురాంపురం, భరణికోట, వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటివరకు సరైన వర్షాలు కురవక నీటి కోసం ఎదురు చూశారు. ఇప్పుడు నాట్లకు సరిపడా నీరు ఉండడంతో రైతులు వ్యవసాయ పనులకు ఉపక్రమించారు. దీంతో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

సరదాగా.. సందడిగా...

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా పాఠశాల ప్రాంగణంలో ఆదివారం సరదాగా కలుసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. ఆడారు, పాడారు. అందరూ ఏకమై సందడి చేశారు. ఈ పదేళ్లలో తమ అనుభవాలు, అనుభూతులు పంచుకున్నారు. ఆత్మీయ ఆలింగానాలతో ఈ ఆదివారం ఆనందమయం చేసుకున్నారు.